అడల్ట్స్ ఓన్లీ కథ

# తొలిరాత్రి

జి. రంగబాబు

శోభనం గది.


రకరకాల పూలతో అలంకరించబడి సుగంధాలు విరజిమ్ముతూ అగరొత్తుల పరిమళం గదంతా వ్యాపించి ఆ గదిలోని వాతావరణం మత్తెక్కించేలా ఉంది. మంచం చుట్టూ, పరుపుపైనా పూలు.. మంచంపై పూలతోనే వధూవరుల పేర్లు..

బయట నుండి ఎవరో తోస్తే లోపలికి వచ్చిపడినట్లుగా రివ్వున దూసుకొచ్చింది అనూష చేతిలో పాల్గ్లాసుతో. ఆ వెంటనే బయట తలుపు గొళ్లెం పడిన చప్పుడు.. అమ్మలక్కల నవ్వులతో కలిసిపోయింది. అనూష కూడా లోపల తలుపు గడియ పెట్టుకుని తలవంచుకుని కొద్ది క్షణాలు అక్కడే నిలబడిపోయింది కాలి బొటనవేలితో నేలను రాస్తూ.

ఎంతసేపటికీ ఏ స్పందనా రాకపోయేసరికి తలెత్తి మంచం వైపు చూసింది. మంచంపై ఆమె కోసం ఎదురుచూస్తూ.. ఆత్రంగా ఆకాష్ కనిపించలేదు. గదంతా కలయజూసింది. అయినా అతని జాడ లేదు. తను లోపలికి రావడమేమిటి.. అప్పటివరకూ ఎంతో ఆరాటంగా ఎదురుచూస్తున్నా ఆకాష్ క్షణమాలస్యం చెయ్యకుండా తన దగ్గరికి వచ్చి భుజాల చుట్టూ చేతులు వేసి సుతారంగా పట్టుకొని మంచం వద్దకు నడిపించుకుంటూ తీసుకొని వెళ్లి కూర్చోబెట్టి తన చేతిలోని పాల్గ్లాసు అందుకుని తను కొంచెం త్రాగి మిగిలినవి తనను త్రాగమంటాడని ఊహించిన అనూషకు అతను ఎదురు రాకపోగా నిరాశ ఎదురైంది. ఖాళీ మంచం ఆమెను చూసి నవ్వుతున్నట్లుగా అనిపించింది.

రమ్య అయితే ఇంకా ఎక్కువే చెప్పింది.. అనుకుంటూ రమ్య చెప్పిన విషయాలను గుర్తుచేసుకుంది. ''అనూ.. నువ్వు గదిలోకి ప్రవేశించడమేమిటి, అంతవరకూ మంచంపై నీ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న అతను ఒక్కసారిగా లేచి నీ దగ్గరకు వచ్చి తన రెండు చేతులతో అమాంతం నిన్ను ఎత్తుకుని మంచం దగ్గరికి తీసుకుని వెళ్లి సుతారంగా పడుకోబెడతాడు. నువ్వు ఆశ్చర్యంలో నుండి తేరుకోకముందే ముద్దులతో ముంచెత్తేస్తాడు. నీ మోముపై దోబూచులాడుతున్న ముంగురులను సవరించి ప్రేమగా, ఆత్రంగా నిన్ను తన గుండెలకదుముకుంటాడు. వెంటనే నీ చుబుకం ఎత్తి నీ కళ్లపైన, చెక్కిలిపైనా ముద్దులు కురిపిస్తూ తన పెదాలతో నీ పెదాలను మూసేస్తాడు.

ఇంగ్లీష్ కిస్‌తో కొద్ది నిముషాలు నీ పెదాలను జుర్రుకుంటాడు. ఆ 'తొలిముద్దు'కు నీ ఒంటిలోని నరాలన్నీ జివ్వుమంటాయి తెలుసా? అంతవరకూ ఇన్నేళ్లుగా నీలో నిద్రపోతున్న కోరికలన్నీ ఒక్కసారిగా నిద్రలేచి పురివిప్పి నాట్యం చేస్తాయి. నీకు తెలియకుండానే నీ చేతులు అతని వీపు చుట్టూ పడి అతణ్ని అల్లుకుంటాయి. అలా ఎంతసేపుంటారో తెలీదు. నీ అధరామృతాన్ని అదే పనిగా గ్రోలుతూ అతని చేతులను నీ ఒంటిపై ఎక్కడెక్కడో నాట్యం చేయిస్తాడు. దాంతో నువ్వు అదో రకమైన మత్తులోకి జారిపోయి కళ్లు మూసుకుని తాదాత్మ్యం పొందుతావు. అతను చేసే




చర్యలన్నింటికి నీ వంతు సహకారం పూర్తిగా అందిస్తావు. అమరసుఖాలు మీ సొంతమవుతాయి''

రమ్య చెప్పిన విషయాలు గుర్తుచేసుకుని అలా జరగకపోయేసరికి ఆమెలో కాస్త నిరుత్సాహం.. అసలు ఆకాష్ ఏమయ్యాడన్న ఆత్రుత. ఆమెను కుదురుగా ఉండనియ్యడం లేదు. అసలు ఈ మనిషి ఏమైనట్లు? అతను గదిలోకి రావడం తన వాళ్లంతా కళ్లారా చూశారే. అది చూసే వాళ్లంతా తనను మోసేశారు.

## నాకు తెలుగొచ్చు!

**లక్ష్మీకల్యాణం, చందమామ, పౌరుడు... ఈ మూడు సినిమాలు చేసి తెలుగులో క్రమంగా గుర్తింపు తెచ్చుకుంటున్న గుజరాతీ అమ్మాయి కాజల్ అగర్వాల్ తనకి తెలుగు బాగా వచ్చంటున్నది. ఇంకా తెలియని మాటలు ఏవైనా వుంటే నేర్చుకుంటున్నానని చెప్పే కాజల్ త్వరలోనే తెలుగు ఇంకా చక్కగ మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నానంటోంది. ఎందుకంటే తనకి తెలుగు సినీ రంగం నుంచి లభిస్తున్న ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందట.**



''మీ ఆయన ఆలస్యాన్ని తట్టుకోలేకపోతున్నట్లున్నాడే. గదిలోకి జరజరా దూరిపోయాడు ఏదో పనున్నట్లు. 'ఆ' ముహూర్తం వరకూ కూడా ఆగేట్లు లేడు. నువ్వు మాత్రం తొందరపడవద్దు. నెమ్మదిగా మాటల్లోకి దింపి ముహూర్తం టైము వరకూ కాలక్షేపం చెయ్యి. లేకుంటే మీ దారి మీది. ముహూర్తం దారి ముహూర్తానిదీ అయిపోతుంది'' అంటూ వేళాకోళం కూడా చేశారు.

కానీ ఇక్కడి పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది. అసలు మనిషే పత్తా లేడు. ఎక్కడికెళ్లినట్లు? ఈ శోభనం అతనికి ఇష్టం లేదా? లేక తనతో పెళ్లే ఇష్టం లేదా? ఈ గదిలో నుండి బయటకు పోవడానికి వేరే దారేదైనా ఉందా? అనేకమైన అనుమానాలు ఆ క్షణంలో ఆమెను చుట్టుముట్టి నిలవనియ్యడం లేదు.

సరే చూద్దాం.. ఇంకేమైనా బైటకు దారులున్నాయేమో అనుకుంటూ మంచం దాటుకుని ముందుకు వెళ్లేసరికి అక్కడో ద్వారం కనిపించింది. ఆ ద్వారంలో నుండి బైటకు వెళ్తే బాల్కనీ ఉంది. బాల్కనీలో నిలబడి ఆకాశంలోకి చూస్తూ సిగరెట్ కాల్చుకుంటున్నాడు ఆకాష్.

హమ్మయ్య.. ఇక్కడే ఉన్నారు. ఎక్కడికీ పారిపోలేదు అనుకుని గుండెలపై చెయ్యి వేసుకుంది. గురుడికి సిగరెట్ అలవాటుందన్నమాట అని మనసులో అనుకుంది.

ఐతే ఆకాష్ ఈ లోకంలో లేడు. ఆకాశంలో కనిపిస్తున్న నిండు చంద్రుణ్ని చూస్తూ తన్మయత్వంలో ఉన్నాడు. ఆ రోజు పున్నమి కావడాన వెన్నెల కూడా విరగకాస్తోంది. ఆ వెన్నెల జల్లుల్లో తడుస్తూ ఈ ప్రపంచాన్నే మరిచిపోయేటంత తన్మయత్వంలో మునిగిపోయాడు.

అనూష రాక కూడా అతనికి తెలియలేదు.

ఆమె తన కాలిపట్టీలను, చేతి గాజులను కదిపి సవ్వడి చేసింది. ఉలికిపడి ఈ లోకంలోకి వచ్చాడు ఆకాష్.

ఆమెను చూసి కాస్త తత్తరపాటుతో చేతిలోని సిగరెట్‌ను పారేసి ''మీరా! ఎంతసేపైంది వొచ్చి?'' అని మాత్రం అనగలిగాడు.

ఇతనేంటి తనను మీరా అని గౌరవంగా, బహువచనంతో సంబోధిస్తున్నాడు. తను అతని భార్యే కదా! తాళికట్టిన మరుక్షణం నుండీ అర్ధాంగైపోయింది కదా! భార్యను ఏకవచనంతో పిలవగలిగే హక్కూ, అర్హతా దాంతో పాటూ వచ్చేసినట్లే కదా! అని మనసులోనే కాస్త ఆశ్చర్యపోయింది.

ఆమె నుండి ఏ సమాధానమూ రాకపోయేసరికి ''వెన్నెల ఇంత బాగా కురుస్తుంటేనూ ఇక్కడికొచ్చి చూస్తున్నా..సారీ..!'' అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్లుగా.

''పర్వాలేదు'' తన మాట తనకే వినిపించనంత నెమ్మదిగా అంది.

'ప్రకృతి ఆరాధకుడు, భావుకుడు అన్నమాట. మంచిదే. మరి స్త్రీ కూడా ప్రకృతికి ప్రతిరూపమే కదా! తను వచ్చేసిందిగా. ఇక ప్రకృతిని ఆరాధించడం మాని తననే ఉద్ధరించవచ్చు కదా' అనుకుంది మనసులో.

''లోపలికి వెళ్దామా?'' అని అడగాలని నోటి చివరి వరకూ వొచ్చింది గానీ బిడియం వల్ల అలా అడగలేకపోయింది. అలా అడిగితే తను అతని ముందు చులకనైపోదూ? అతని కంటే తనకే తొందరా, ఆరాటం ఉన్నాయని భావించడూ? స్వప్న చెప్పింది. మగవారికే ఆడవాళ్ల కంటే ఆత్రతా, ఆరాటమూ ఎక్కువగా ఉంటాయట. అనూష, స్వప్న చెప్పిన విషయాలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుంది.

''అనూషా! మగవాళ్లకు మొదటి రాత్రే అన్నీ చూసేయాలని, అన్ని అనుభవాలూ పొందేయాలన్న కోరిక, ఆరాటమూ ఉంటాయి. అందుకే 'ఆరాటపు పెళ్లికొడుకు పేరంటాలి మెళ్లో పుస్తె కట్టేశాడుట' అనే సామెత కూడా చెబుతుంటారు. ఎప్పుడెప్పుడు తాళి కట్టేసి ఈమెను నా సొంతం చేసుకుంటానా! ఎప్పుడెప్పుడు గదిలోకి.. అదే, శోభనం గదిలోకి దూరి తలుపేసేసుకుని 'ఆ' అనుభవాన్ని చవిచూసేద్దామా అని అనిపిస్తూ ఉంటుందట. పాతికేళ్ల ఫోర్సు ఆ నిమిషంలో చూపించేస్తారట. నువ్వు ఆ ఫోర్సుకి అదిరిపోయి, బెదిరిపోకుండా అతనేం చేసినా నువ్వు సహకరిస్తేనే ఆ ఆనందం నీకూ సొంతం అవుతుంది. స్వర్గం నీదవుతుంది. తొలిరేయి నీ జీవితంలో మరపురాని రేయిగా, తీపిజ్ఞాపకంగా మిగిలిపోతుంది. అందుకని నీకిప్పుడే ముందే చెప్పేస్తున్నా. అతని ధాటికి అతనెంత రెచ్చిపోయినా నువ్వు మాత్రం అదిరిపోకు.

పూర్తిగా సహకరించు. అలా చేశావంటే నీ ఫస్ట్‌నైట్ సూపర్‌హిట్ అయిపోతుంది''

స్వప్న మాటలు.. ఇతన్ని చూస్తుంటే.. నిజం అనిపించడం లేదు. ఏ భావమూ లేకుండా నిమ్మకునీ రెత్తినట్లుంటున్న ఇతను నిజంగా తనను ఇష్టపడే చేసుకున్నాడా? లేకుంటే అంతకు ముందు ఏ అమ్మాయినైనా ప్రేమించి విఫలమైన భగ్నప్రేమికుడా? అసలేమీ తెలియడం లేదు. అర్ధరాత్రి దాటిపోయింది. పెద్దవాళ్లు పెట్టిన ముహూర్తం గడువుకు కొద్ది నిమిషాలు మాత్రమే టైముంది. అసలీ ముహూర్తం విషయం ఇతనికి తెలుసా? తెలిసే ఇలా ఉలకక.. పలకక.. పప్పుసుద్దలా ఉన్నాడా? తనను ఇష్టపడే పెళ్లి చేసుకుంటున్నాడని, అతనికి నేను నచ్చానని చెప్పారే.. మరెందుకీ ఆలస్యం? తొందరగా తొలిరేయి అనుభవాలను మూటగట్టేసుకుంటే స్వీట్ నథింగ్స్ రేపు తన స్నేహితురాళ్లతో పంచుకోవాలి కదా! ఇప్పటికే సమయం దాటిపోయింది. తెల్లవారిపోయేలా ఉంది గానీ ఈ లోపు వారు చెప్పినట్లు ఎన్నెన్నో జరగాలి. కానీ ఒక్కటీ జరగడం లేదు. వాళ్లకేం చెప్పాలి ఉదయాన్నే! ఇప్పటికింకా ఒక్క మాటైనా మాట్లాడలేదు. ఎందుకీ ఆలస్యం? ఏమిటీతని ఆంతర్యం? ఆమె మనసు పరిపరి విధాలా పోతూంది. తొలిరేయి గురించి ఎన్నో ఊహించుకుంది. ఎన్నెన్నో కలలు కంది. తొలిరాత్రి ముచ్చట్లు.. ఇప్పటివరకూ చవిచూడని కొత్త అనుభవాలు.. ఇవన్నీ తనకు లేనట్లేనా?' అని మనసులోనే బాధపడుతూ ఎదురుచూస్తోంది అతని పిలుపు కోసం!


''అనూషా!'' అని పిలిచాడతను. 'అబ్బా ఎంతసేపటికి అతని నోటి నుండి తన పేరు?' ఆమె మనసు ఆనందంతో ఉర్రూతలూగింది.

''లోపలి గదిలో కంటే ఇక్కడే బావుంది. ఇంకొంచెం సేపు ఇక్కడే ఈ వెన్నెల వెలుగులోనే కాలక్షేపం చేద్దామంటే మీకేమైనా అభ్యంతరమా?''

అతనలా అడుగుతాడని ఊహించలేదు. 'ఇప్పటికే సమయం మించిపోయింది.. పద..పద.. లోపలికి వెళ్లి మన తొలి రాత్రిని మధురమైన రాత్రిగా మార్చుకుందాం.. అందమైన అనుభూతుల్ని మన సొంతం చేసుకుందాం' అని అంటాడని ఊహించిన అనూషకు అతని ప్రపోజల్ ఒక రకంగా షాక్‌కి గురిచేసింది. ఇవతల టైమైపోతోందిరో అని తను గోలపెడుతూంటే ఇంకా ఇక్కడే కూర్చుని వెన్నెలని తాగుదాం కాలక్షేపం చేద్దాం అంటాడేమిటి?

సందేహం లేదు. ఇతనికి తనతో తొలిరాత్రి పంచుకోవడం ఇష్టం లేదు. కొత్త పెళ్లాంతో ముద్దూ, ముచ్చటా జరపాలని లేదు. నిజమే.. మొదటిరాత్రి మగవాళ్లెవరూ ఇలా మాట్లాడరు. ప్రవర్తించరు. ఇతను ప్రవర్తిస్తున్నాడంటే మిగిలిన ఈ కాస్త రాత్రినీ కబుర్లతోనూ, కాకరకాయలతోనూ కాలక్షేపం చేద్దామనుకుంటున్నాడంట.. తొలిరాత్రి అనుభవం కోసం అతని శరీరం, మనసూ తహతహలాడడం లేదంటే కచ్చితంగా ఇతనిలో ఏ లోపమో ఉండి తీరాలి. సందేహం లేదు. తను మోసపోయింది..

అందమైన నిండైన విగ్రహం వెనుక ఇంతటి దారుణం దాగి ఉందా? ఇతను ఇలాంటి వాడన్న విషయం గ్రహించలేకపోయా•రా తన వాళ్లు? ఎన్ని ఊహించుకుంది? ఎన్నెన్ని కలలు కంది? అన్నీ వ్యర్థమేనా? తన ఫ్రెండ్సు ఎన్ని అనుభవాలు తన ముందుంచారు! ఎన్ని తీపిగుర్తుల్ని మూటగట్టుకొమ్మని సలహాలిచ్చారు! రేపు వారికేం సమాధానం చెప్పాలి? అయ్యో.. మొదటిరాత్రి తెల్లవారకుండానే నా నూరేళ్ల జీవితం.. నా దాంపత్య జీవితం తెల్లారిపోయిందా? భగవాన్! అనుకుంటూ మనసులోనే దుఃఖించింది. అయినా అప్రయత్నంగా ఆమె కళ్లలో నీళ్లు.. అతని కంట పడకుండా పైటచెంగుతో తుడుచుకుంది.



ఆమె అలా కళ్లు వత్తుకోవడం ఆకాష్ కంటపడింది. ఆశ్చర్యపోయాడు.

''అరె! ఎందుకా కన్నీళ్లు? ఏమైందని?'' గాభరాగా అడిగాడు.

''ఏమీ కాలేదనే!'' టక్కున సమాధానం చెప్పింది. మనసులోని బాధను ఇక అట్టేసేపు దాచుకోవడం ఆమెకు సాధ్యం కావటం లేదు.

''అంటే?'' అర్థం కానట్లు అడిగాడు ఆకాష్. ఇప్పటికీ ఆమె ఎందుకేడుస్తోందో అతనికి అంతుబట్టలేదు.

అప్పుడు నోరు విప్పిందామె. తన మనసులోని బాధనంతటినీ అతని ముందు వెళ్లగక్కింది. తను ఊహించుకున్న మొదటి రాత్రి అనుభవాలు.. తన స్నేహితురాళ్లు తొలిరేయి జరిగే ముచ్చట్లు గురించి చెప్పిన అన్ని విషయాలూ మొత్తం ఏకరువు పెట్టింది. అంతేకాకుండా అతని పట్ల ఆమె మనసులోని భయము, భావమూ కూడా.. అది చెబుతున్నప్పుడు ఆమె కంఠం మరింత రుద్ధమైంది.

ఆమె చెప్పిందంతా విని నివ్వెరపోయాడతను. తర్వాత నవ్వేశాడు.. అతనలా నవ్వేసరికి మరింత ఉడుకుమోతుతనం వచ్చింది అనూషకు.

''ఎందుకలా నవ్వుతారు? చేసింది చాలక?''

''నేనేం చేశానూ?'' అన్నాడు అమాయకంగా. ''ఏమీ చెయ్యలేదన్నావు కదా నువ్వే?''

''ఔను.. ఏం చెయ్యలేదనే కదా

## నంబర్ వన్ కరీనా?

**కరీనా కపూర్ కెరీర్ అయిపోయిందని భావిస్తున్న సమయంలో 'జబ్ వుయ్ మెట్' సినిమా బంపర్ సక్సెస్ కావడం మలుపు తిప్పినట్టయిందిప్పుడు. అష్టవినాయక ఫిలింస్ వారి మూడు సినిమాల కాంట్రాక్టుకి గాను 8 కోట్లు అందుకుంటున్న కరీనా (అంటే యావరేజ్‌గా సినిమాకి రెండున్నర కోట్లు అనుకోండి) మరో సినిమాకి మూడున్నర కోట్లు తీసుకుంటూ నంబర్ వన్ అనిపించుకుంటోందని బాలీవుడ్ వార్తలు. ప్రియదర్శన్ డైరెక్షన్‌లో నిర్మాణం కాబోయే సినిమాకి ఈ మొత్తాన్ని డిమాండ్ చేస్తోందిట కరీనా.**

మహానుభావా నేనింత సేపూ మొత్తుకుంది. నేనంత చెప్పుకుని బాధపడుతున్నా తమకు చీమకుట్టినట్లు కూడా లేదు సరికదా పైగా నవ్వుతున్నారు. ఎందుకండీ ఆ నవ్వు?'' అడిగింది కోపంగా చూస్తూ.

''సరే.. అక్కడికే వస్తున్నా! ఏదో చెయ్యాలన్నావు కదా! అసలు నేనేం చెయ్యాలి? ఇంతకూ నువ్వెవరు? నేనెవరు?'' అన్నాడు ఉపోద్ఘాతంగా.

''మనమెవరం అంటారేంటి? భార్యాభర్తలం! అగ్నిసాక్షిగా మీరు నాకు తాళికట్టిన భర్త. 'నాతిచరామి' అంటూ వేదమంత్రాల మధ్య మీ చేయందుకుని ఏడడుగులూ నడిచిన మీ అర్ధాంగిని నేను'' అంది స్థిరంగా.

''ఒప్పుకుంటాను. తాళి కట్టిన మరుక్షణం నుండీ మనం భార్యాభర్తలం. సరే. మరి కట్టక ముందు?''

అతనడిగిన ప్రశ్న సరిగా అర్థం కాలేనట్లు మొహం పెట్టిందామె.

''చూశావా? చెప్పలేకపోయావు సమాధానం! నేను చెప్పనా? తాళి కట్టక ముందు మనం ఒకరికొకరు అపరిచితులం'' అన్నాడు.

''అదేంటి? అపరిచితులం ఎందుకవుతాం. ఎప్పుడైతే మన వివాహం నిశ్చయం అయిందో అప్పటి నుండే మనం భార్యాభర్తలం అయిపోయినట్లే''

''ఎలా? మన పెళ్లిచూపుల్లో ఆ హడావుడి మధ్య మీ ముఖమైనా సరిగ్గా చూడలేకపోయాను. నేను మిమ్మల్ని చూసిన ఒకటి రెండుసార్లూ మీరు తలదించుకునే ఉన్నారు. ఇక టైమయిపోవడంతో నేను బయలుదేరిపోయాను. అంతమంది బంధువుల మధ్య, హాస్యోక్తుల మధ్య మీరైనా నన్ను సరిగ్గా చూశారా?''

''లేదు.. నేనూ సరిగ్గా చూడలేదు మిమ్మల్ని'' ఒప్పుకుందామె.

''సో.. మనం పెళ్లి నిశ్చయమయ్యేనాటికి పరిచయస్తులం కాదు. కనీసం సరిగ్గా చూసుకొనే లేదు. ఇక పెళ్లి రోజున.. రెండు రోజుల ముందు నుండే పెళ్లికొడుకును చేయడం.. బంధువుల, స్నేహితుల హడావుడి.. పని, నిద్రలేమి, అలసట.. పైగా మండువేసవి.. చుట్టూ జనం.. ముందర అగ్నిహోత్రం ఉక్కపోత.. కొన్ని గంటల సేపు పెళ్లితంతు. మిమ్మల్ని పెళ్లిపీటల మీదనైనా సరిగ్గా చూద్దామనుకుంటే ఈ చిరాకు, ఈ తంతుల మధ్య అసలా ఆలోచనే రావటం లేదు. మన మధ్య తెర తొలిగాక మిమ్మల్ని సరిగ్గా చూడటం తటస్థించింది. మరి మీరు నన్ను బాగా చూశారా?''

''సిగ్గుతో.. ఆ హడావుడిలో.. నాకూ కుదరలేదు. ఎంత తొందరగా ఆ తంతు ముగుస్తుందా అని చూశాను''

''చూశారా, కనీసం ఒకరికొకరం బాగా చూసుకోకుండా మాట్లాడుకోకుండా పరిచయస్తులం ఎలా అయిపోతాం? చెప్పండి? మిమ్మల్ని ఎలా ఏకవచనంతో పిలవగలను? నా గురించి మీకు తెలీదు. మీ గురించి నాకు తెలీదు. కాసేపయినా మనం మాట్లాడుకోలేదు. అలాంటప్పుడు కనీసం మాటైనా లేకుండా మిమ్మల్ని అమాంతం ఎత్తుకోవడమేమిటి, మీద పడిపోవడం ఏమిటి? క్రిందా మీదా అయిపోవడం ఏమిటి? అది అర్థరహితం కాదూ? మీకు మీ స్నేహితులు చెప్పిందంతా నిజం కాదు. అసలే మాటలూ లేకుండా అంత దగ్గరితనం ఎలా సాధ్యం? అయితే మొదటి రాత్రి పూర్తయ్యేలోపు 'ఆ' అనుభవం చాలామందే పొంది ఉండవచ్చు. దానికి కారణం పెద్దలు పెట్టిన ఆచారాలూ, ముహూర్తాలూనూ. అయితే ఆ కలయికలో ప్రేమ ఉండదు. ఆకర్షణ తప్ప. అనుభూతి ఉండదు ఆరాటం తప్ప. ఎందుకంటే శృంగారానికి కావల్సింది రెండు శరీరాలే కాదు రెండు మనసులు కూడా.

ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం, ప్రేమ, పరిచయం, అనురాగం ఉన్నప్పుడే ఆ కలయిక స్వర్గాన్ని తలపిస్తుంది.

ఇప్పటికీ తొలిరాత్రి అంటే పెళ్లికొడుకుకు బలపరీక్ష అని నమ్మే మనుషులున్నారు. అమ్మాయి కన్నెరికానికి పరీక్షగా భావించే ఆటవికులున్నారు. కానీ మనది సభ్యసమాజం. ఆలుమగలు కలిసే ముందు ఒకరికొకరు అర్థమవ్వాలి. మనసూ..మనసూ.. ఊసులాడుకోవాలి. మనసు మనసుతో మమేకం కావాలి. తొలుత రెండు మనసులూ రమించుకోవాలి. అప్పుడే శరీరాలు ఏకం కాగలుగుతాయి. ఎన్నో అనుభవాలు వారి సొంతం అవుతాయి.

ఇది మన జీవితంలో 'తొలిరాత్రి' మాత్రమే. ఇంకా మన కోసం వేనవేల రాత్రులు ఎదురుచూస్తున్నాయి. ఇన్ని రాత్రులుండగా తొలిరాత్రికి మాత్రమే ఎందుకు ఆరాటపడాలి? ఈ ఒక్కరోజు మనం మనసు విప్పి మాట్లాడుకోవడానికి, ఒకరినొకరం అర్థం చేసుకోవడానికి కేటాయిస్తే ఇక రేపటి నుండీ వచ్చే ప్రతీ రాత్రి మనకు వసంతరాత్రే అవుతుంది.

నిజంగా నీకా అనుభవమే కావాలనుకుంటే నేను అందుకు సిద్ధం. లేదా ఈ రాత్రంతా మనం ఎన్నో విషయాలు చెప్పుకుందాం. సరదాగా గడుపుదాం. ఇదే మన భావి దాంపత్య జీవితానికి పునాది. ఏమంటావ్?'' అనడిగాడు.

అనూష సిగ్గు పడింది. అతన్ని గురించి ఏవేవో ఊహించినందుకు ఇంత మంచి వాడు, మనసున్న వాడు భర్తగా దొరికినందుకు పొంగిపోయింది. ''నన్ను క్షమించండి. నేను చాలా అదృష్టవంతురాలిని'' అని అంది.

అతను ప్రేమగా ఆమె నుదుటిని చుంబించాడు.

చందమామ వారిని చూసి సిగ్గు పడి పక్కకు తప్పుకుంది.

☆

## పుష్కరం తర్వాత...

**పన్నెండేళ్ల క్రితం 'ప్రేమదేశం' చిత్రం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. కుర్రకారుని వెర్రెక్కించిన ఈ సినిమా పాటలు థియేటర్లలో వాళ్లచేత డాన్సులు చేయించాయి. డబ్బింగ్ సినిమా అయివుండీ కలెక్షన్లలో రికార్డు సృష్టించిందీ సినిమా. ఇందులో నటించిన అబ్బాస్-టాబు మళ్లీ ఇన్నాళ్లకి కలిసి జంటగా నటిస్తున్నారు. వీరి కాంబినేషన్‌లో వస్తోన్న తాజా చిత్రం 'ఇదీ సంగతి'. మరి నాటి విజయాన్ని ఈ జంట నేడు సాధిస్తుందా అని అంతా ఎదురుచూస్తున్నారు.**

